క్లుప్తంగా

'నమస్తే'లో నమోదు చేసుకోవాలి

బాపట్ల: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నమస్తే పథకంలో బాపట్ల పురపాలక సంఘ పరిధిలోని ప్రతి సెప్టిక్ ట్యాంక్, భూగర్భ డ్రైనేజీ కార్మికులు తప్పనిసరిగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని మునిసిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకంలో చేరడానికి పురపాలక సంఘం పరిధిలోని సంబంధిత వార్డు సచివాలయంలోని శానిటరీ సెక్రటరీలను సంప్రదించాలన్నారు. ఇతర వివరాలకు 7396726671 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

కోలాహలంగా ముగ్గుల పోటీలు



భట్టిప్రోలు (కొల్లూరు) : సంక్రాంతి సంబరాలలో భాగంగా ముగ్గుల పోటీలు కోలాహలంగా నిర్వహించారు. ఆదివారం భట్టిప్రోలు 16వ వార్డులో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో యువతులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొని రంగు రంగుల ముగ్గులను తీర్చిదిద్దారు. పద్మశాలీయ యువజన సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన పోటీలలో భాగంగా 31 మంది మహిళలు పోటీపడ్డారు. పోటీలలో గెలుపొందిన విజేతలకు నిర్వాహకులు వంగర వీరయ్య, గౌతమ్, శ్రీనివాసరావులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యువకులు, పద్మశాలీయ పెద్దలు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



రేపల్లె రూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో 1993–96 విద్యా సంవత్సరాల మధ్య బ్యాచిలర్ ఆఫ్ కామర్స్ చదివిన పూర్వవిద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని కళాశాలలో సరదాగా గడిపిన రోజులను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా రిటైర్డ్ తెలుగు అధ్యాపకుడు మొవ్వ వృషాధిపతి, రిటైర్డ్ కామర్స్ అధ్యాపకుడు వెంకటేశ్వర్లు, ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ సాంబశివరావు, అధ్యాపకుడు అంజనేయులు, ఆదర్శ డిగ్రీ కళాశాల డైరెక్టర్ షేక్ మొహిద్దీన్‌లను పూర్వ విద్యార్థులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

డీఎస్పీ గోగినేని రామాంజనేయులు



బాపట్ల: కోడి పందేలు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ గోగినేని రామాంజనేయులు హెచ్చరించారు. బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ గోగినేని మాట్లాడారు. చందోలు పోలీస్ స్టేషన్ పరిధిలో కోడి పందేలు వేసేందుకు కొంత మంది ప్రయత్నిస్తున్నట్లు మా దృష్టికి వచ్చిందని, అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ పాటికే సంబంధిత పొలాల యజమానులకు నోటీసులు ఇవ్వటం జరిగిందని అన్నారు. జిల్లా ఎస్పీ తుషార్‌డూడి ఆదేశాల మేరకు డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంటుందని తెలిపారు. ఎవరైనా పందేలు, పేకాటలు నిర్వహిస్తే కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. సంప్రదాయబద్ధంగా సంక్రాంతి ఎడ్ల పందేలు జరుపుకోవాలి తప్ప, కోడి పందేలు, పేకాటలు, గుండాటలు నిర్వహిస్తే సహించేది లేదని తెలిపారు. సమావేశంలో సీఐ శ్రీనివాసరావు, ఎస్సై పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

ఎస్‌ఐ శివయ్య

భట్టిప్రోలు (కొల్లూరు) : సంక్రాంతి సంబరాల పేరుతో కోడి పందేలు, పేకాటలు, ఇతర జూద క్రీడలు నిర్వహిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని భట్టిప్రోలు ఎస్‌ఐ శివయ్య హెచ్చరించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ జూద క్రీడలు నిర్వహించకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టడంతోపాటు, నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కోడి పందేల నిర్వహణకు ఎటువంటి అనుమతులు లేనందున పందేల నిర్వహణ చేపడితే ఉపేక్షించబోమన్నారు. మండలంలోని పల్లెకోనలో కోడి పందేల నిర్వహణకు ఏర్పాటు చేసిన బరుల వద్ద సైతం ఎటువంటి పందేలు జరపకుండా పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సంక్రాంతి పండుగను కుటుంబ సభ్యులతో కలసి ఆనందంగా జరుపుకోవాలే గానీ జూద క్రీడలలో పాల్గొనరాదని హెచ్చరించారు.

యంత్రాలతో కోత.. పశుగ్రాసం కొరత

- పశుపోషకులను పట్టి పీడిస్తున్న వరి గడ్డి కొరత
- పంట భూముల్లోనే గ్రాసాన్ని దగ్ధం చేసిన రైతులు
- పశువుల మేత కొరతతో అమాంతం పెరిగిన ధరలు



ట్రాక్టర్లలో దిగుమతి చేసుకుంటున్న వరిగడ్డి



యంత్రాలతో కోతలు కోసిన వరిగడ్డిని కట్టలుగా కడుతున్న యంత్రం



పంట పొలాల్లో దగ్ధం చేస్తున్న వరిగడ్డి

కొల్లూరు : వరి గడ్డి కొరతతో పశు పోషకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా వేలాది సంఖ్యలో ఉన్న పశువులకు ప్రధాన ఆహారంగా వినియోగించే వరి గడ్డి లభ్యత ఈ ఏడాది గణనీయంగా తగ్గిపోవడంతో పశువుల పెంపకం పెను భారంగా పరిణమించింది. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా సుమారు 1.50 లక్షల ఎకరాలకుపైగా వరి సాగు చేపట్టినప్పటికీ యంత్రాలతో కోతల కారణంగా పశుపోషకులకు ఎండు గడ్డి దొరకకుండా పోయింది.

విపత్కర వాతావరణ పరిస్థితులు

ఈ ఏడాది కోతల సమయంలో విపత్కర వాతావరణ పరిస్థితులు.. కూలీలకు ఏర్పడిన డిమాండ్ ఫలితంగా కోతలకు యంత్రాలను వినియోగించడంతో వరి గడ్డి కొరత ఏర్పడింది. కోతల దశలో ముంచుకొచ్చిన వర్షాలతో ధాన్యంతోపాటు, వరి గడ్డి తడిసిపోయి పనికిరాకుండా పోవడం, హడావుడిగా యంత్రాలతో కోయించడం కారణంగా ఎండు గడ్డి లేక పోవడంతో కొరత ఏర్పడి ధరలు మండిపోతున్నాయి. పశుగ్రాసం ధరలకు రెక్కలు రావడంతో పశుపోషకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యంత్రాలతో కోసిన వరి గడ్డిని కట్టలు కట్టిస్తే యంత్రాలు తిరిగి పంట భూములు పాడవుతాయన్న ఉద్దేశంతో రైతులు గడ్డిని వ్యవసాయ క్షేత్రాలలోనే దగ్ధం చేయడం పశుగ్రాసం కొరతకు ప్రధాన కారణంగా మారింది. వరి గడ్డి రేటు అమాంతం పెరిగిపోవడంతో ఎండు గడ్డిని అపురూపంగా చూసుకుంటూ పశువులకు ఆచితూచి వేసుకోవాల్సిన పరిస్థితి తలెత్తింది. అధిక విస్తీర్ణంలో వరిసాగు చేసే డెల్టా ప్రాంతంలో వరగడ్డికి కొరత ఏర్పడటానికి కారణం యంత్రాల సాయంతో వరి కోతలు చేపట్టడమేనని పశుపోషకులు అభిప్రాయపడుతున్నారు.

పెరిగిన డిమాండ్

వరి గడ్డి కొరత కారణంగా ఎండు గడ్డికి డిమాండ్ పెరగడంతో ధరలు మండుతున్నాయి. ఎకరా పొలంలో ఎండుగడ్డి రెండేళ్ల క్రితం వరకూ రూ.4 వేల నుంచి రూ.5 వేలు లోపు ఉండగా గతేడాది అమాంతం పెరిగి రూ.7 వేలకు పైగా పలికింది. ప్రస్తుతం పొరుగు జిల్లా అయిన కృష్ణా జిల్లాలోనూ యంత్రాల సాయంతో కోతలకు రైతులు మొగ్గు చూపడంతో పశుగ్రాసం కొరతతో తీవ్ర డిమాండ్ ఏర్పడింది. ప్రస్తుతం ఎకరా ఎండు గడ్డి ధర రూ.12,000 నుంచి రూ.13,000 పలుకుతుండగా, గడ్డి లభ్యత లేకపోవడంతో ముందు ముందు మరింత పెరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయన్న భావన రైతులు వ్యక్తం చేస్తున్నారు. వరిగడ్డి ధరలు పెరిగి రేట్లు చుక్కలను అంటుతుండటంతో పశువుల పెంపకం తలకుమించిన భారంగా మారుతుందని పశు పోషకుల్లో ఆందోళన వ్యక్తమవుతుంది. పాడి పరిశ్రమ వల్ల వచ్చే ఆదాయానికి మించి వరిగడ్డి రేటు పెరిగిపోతే రైతులు నష్టపోవాల్సి వస్తుందని పశు పోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వరి గడ్డి మోపు రూ.130

వరి సాగు అధికంగా ఉన్న డెల్టా ప్రాంతంలోని కొల్లూరు, భట్టిప్రోలు, వేమూరు, చుండూరు, అమృతలూరు, రేపల్లె, చెరుకుపల్లి తదితర మండలాల్లో విస్తారంగా లభ్యమయ్యే వరి గడ్డికి తీవ్ర కొరత ఏర్పడింది. యంత్రాల సాయంతో కోసిన వరి గడ్డిని రైతులు పంట పొలాల్లోనే దగ్ధం చేయడంతో పశుగ్రాసం కోసం పశు పోషకులు అన్వేషణ చేపట్టాల్సిన పరిస్థితి. జిల్లాలో సాగైన వరి విస్తీర్ణంలో 85 శాతం వరకు యంత్రాలతో కోతలు పూర్తి చేసి పశుగ్రాసాన్ని దగ్ధం చేయడంతో వరి గడ్డి మోపు అధిక ధరకు కొనుగోలు చేయాల్సిన అగత్యం ఏర్పడింది. యంత్రాల సాయంతో కట్టలుగా కట్టిన గడ్డి మోపు రూ.100 పలుకుతుండగా, నూర్పిడి చేసిన వరి గడ్డి కట్ట రూ.130 వరకు ఉంది. గడ్డి ధర పెరగడంతో పశు పోషకులు పశువులను మేపలేక అయిన కాడికి తెగనమ్ముకునేందుకు సిద్ధ పడుతున్నారు. వరిగడ్డికి తోడు పచ్చి గడ్డి ధర సైతం అధిక రేట్లలో ఉండటంతో పాడి పరిశ్రమ నిర్వహణ భారంగా మారిపోయింది.

ఇరువురు కోడి పందెం రాయుళ్ల అరెస్ట్

రేపల్లె రూరల్: కోడి పందేలు నిర్వహిస్తున్న ఇరువురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న ఘటన మండలంలోని బేతపూడి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పట్టణ సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాల మేరకు తమకు అందిన సమాచారంతో బేతపూడి గ్రామంలో దాడులు నిర్వహించామన్నారు. దాడులలో గ్రామ శివారులో ఇరువురు వ్యక్తులు కోడి పందేలు నిర్వహిస్తూ పట్టుబడ్డారన్నారు. వారిని అదుపులోకి తీసుకుని రూ.1000 స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు పేర్కొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తున్న వ్యక్తుల అరెస్ట్



జంపని (వేమూరు): కోడి పందేలు నిర్వహిస్తున్న వ్యక్తులను అరెస్ట్ చేయడం జరిగిందని ఎస్‌ఐ రవికృష్ణ తెలిపారు. వేమూరు మండలంలోని జంపని గ్రామంలో ఆదివారం కోడి పందేలు నిర్వహిస్తున్న వ్యక్తులను అరెస్ట్ చేసి రెండు కోళ్లు, రూ.1,150 నగదు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ప్రభుత్వం కోడి పందేలు నిర్వహించరాదని ఆదేశాలు జారీ చేసిందన్నారు. కోడి పందేలు నిర్వహిస్తే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు.

కొరవడుతున్న పల్లె సంక్రాంతులు

అంతరిస్తున్న సంప్రదాయాలు



చిన్నారులకు భోగి పళ్లు పోస్తున్న పెద్దలు (ఫైల్)



12ఆర్‌పిఎల్106: రంగవల్లులు తీర్చిదిద్దుతున్న చిన్నారులు

రేపల్లె రూరల్: లోగిళ్లలో కళ్లకు మిరిమిట్లు గొలిపే రంగు రంగుల రంగవల్లులు.. గొబ్బెమ్మలు.. కూతుళ్ల అల్లుళ్ల సందళ్లు.. హరిదాసుల సంకీర్తనలు.. పట్టుపరికిణీలు కట్టి మగువల గొబ్బి నృత్య ప్రదర్శనలు.. డూ.. డూ.. బసవన్నల రంకెలు.. గాలి పటాలు.. పిండి వంటలు.. కొత్త బట్టలు.. కష్టాలను కాల్చివేసే భోగి మంటలు.. భోగాలను అందించే భోగి పళ్లు, ఇంటికి చేరే ధాన్యపు రాసులు.. పశుపూజలు చేసుకునేందుకు కనుమ కాంతులు.. ఇలా ఇంటింటా జరిగే సంబరాలు.. ఇవన్నీ తలుచుకుంటేనే మనకు గుర్తొచ్చే ఒకే ఒక పండగ సంక్రాంతి. గ్రామీణ నేపథ్యం కలిగిన రే'పల్లె' ప్రాంతాలలో ఇవన్నీ గొప్ప విశేషాంశాలు. పిన్నా పెద్ద అందరూ ఎంత మంది ఉన్నా బంధువులంతా కలిసి పండగ కలిసి చేసుకునే వారు. పెద్ద పెద్ద హైటెక్ సిటీలలో నివాసం ఉండే వారు సైతం తమ పల్లెలకు పరుగు పెడతారంటే పండగ విశిష్టత అంతా ఇంతా కాదు. ఇవన్నీ అనగనగా ఒక పేదరాశి పెద్దమ్మ కథలా చెప్పుకునే పరిస్థితులు వచ్చేశాయంటే అతిశయోక్తి లేదు. పాశ్చాత్య పోకడలతో.. పరుగెడుతున్న జీవితాలలో నెమ్మదిగా అంతరించిపోతున్న పండగలలో సంక్రాంతి చేరుతుందనటంలోనూ ఏ మాత్రం సందేహం లేదు. ఈ పరిస్థితుల్లో సంక్రాంతి పర్వదినం విశిష్టతతో పాటు మన సంప్రదాయాలను ముందు తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఎంతైనా ఉంది.



రేపల్లె పట్టణంలో గంగిరెద్దుల సందళ్లు

ముంగిట రంగ వల్లులు..

ఇంటి ముంగిట ఆకాశంలో ఉండే నక్షత్రాల మాదిరిగా చుక్కలు పెట్టి నెలరోజుల పాటు రంగవల్లులు తీర్చిదిద్దటం, రంగ వల్లుల్లో గొబ్బెమ్మలను ఏర్పాటు చేయటంతో కళకళలాడుతూ ఆ గృహానికి లక్ష్మీ కటాక్షం సిద్ధిస్తుందని ప్రజల నమ్మకం. ఆవు పేడను ముద్దగా చేసి దానిపై పసుపు, కుంకుమ, పువ్వులతో అలంకరించిన గొబ్బెమ్మను ముగ్గు మధ్యలో ఉంచి మగువలు కృష్ణుడి భక్తిగీతాలు ఆలపిస్తుంటారు. గతంలో రేపల్లెలో ఎక్కడ చూసినా పండగ సందడి కనిపించేది. ప్రసుత్తం అడపదడపా తప్ప మరెక్కడా రంగవల్లులు కానరాని పరిస్థితులు ఏర్పడ్డాయి.

భోగి మంటలు

భోగి పండగ రోజు వేకువజామునే వీధులలోని కూడళ్లలో మంటలు వేసి అనంతరం ప్రతి ఒక్కరూ అభ్యంగన స్నానాలు చేస్తారు. అయితే ప్రస్తుతం పట్టణం, గ్రామాలలో ఈ భోగి మంటలు అడపాదడపా కనిపిస్తున్నాయి. అదే రోజు సాయంత్రం ఇళ్లల్లో చిన్నారులకు సూర్యభగవానుడి అనుగ్రహానికై భోగిపండ్లు పోస్తారు.

ధాన్యపు రాసులు ఇంటికి

సంక్రాంతి పర్వదినం రోజున రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యపు రాసులను ఇంటికి చేర్చుతారు. ధాన్యలక్ష్మి ఇంటికి చేరటంతో ఆనందోత్సాహాలతో పొంగళ్లు పెట్టుకుని సంక్రాంతి పండగను చేసుకుంటారు. ప్రస్తుతం ఖరీఫ్ పెట్టుబడులు పెరగటం, అప్పులు చేసిన రైతులు సాగు చేయటంతో ధాన్యపు రాసులు కల్లంలోనే అమ్ముకునే పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో కొంత పండగ వాతావరణం లోపిస్తోంది.

కనుమ కాంతులు

ప్రతి ఒక్కరూ తమ పెద్దలను తలుచుకుంటూ నైవేద్యాలు, కొత్త బట్టలు సమర్పించుకుని చేసుకునే పండగే కనుమ. రైతులు తమ సాగుకు సహకరించే పశువులకు ప్రత్యేక పూజలు చేస్తుంటారు. అంతరిస్తున్న పశు సంపదతో పశు పూజలు చేసేవారే కనుమరుగవుతున్నారు.

హరిదాసుల సంకీర్తనలు

ధనుర్మాసం ప్రారంభమైన నాటి నుంచి మనకు కనిపించే భక్తి సాధువు హరిదాసు. ఒక చేతిలో చిడతలు, మరో చేతిలో తంబూరా, నెత్తిపై కమలాన్ని



హరిదాసుల సందళ్లు (ఫైల్)

పోలి ఉండే ఒక కుండను ఏర్పాటు చేసుకుని హరిదాసు సంచరిస్తాడు. హరిదాసు వీధులలో కీర్తనలు జపిస్తూ సంచారం చేస్తే ఆ గ్రామం పచ్చగా కళకళలాడుతుందన్న విశ్వాసం. కానీ ప్రస్తుతం హరిదాసుల సందడి లేకపోవటంతో, కనీసం కానరాకపోవటం గమనార్హం.



భోగి మంటలు వేస్తున్న పట్టణ వాసులు (ఫైల్)

గంగిరెద్దుల విన్యాసాలు

గంగిరెద్దు ముంగిట నిలిచిందంటే ఆ నేల ధర్మబద్ధమైనదని ప్రజల నమ్మకం. గంగిరెద్దు వస్తుందంటే పిల్లా పాపల ఉత్సాహం. డూ.. డూ.. బసవన్న వచ్చాడు.. అయ్యగారికి సలాం చేస్తాడు అంటూ గంగిరెద్దులు తీసుకువచ్చే వారి హాస్యపు గారడీలు.. నేడు కనుమరగైపోయాయి. అదేవిధంగా గాలి పటాలు ఎగురవేయటం గ్రామాలలోనూ నెమ్మదిగా మాయమైపోతోంది.

ఘనంగా వివేకానంద జయంతి



వివేకనంద జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న ప్రదర్శన

భట్టిప్రోలు (కొల్లూరు): వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం వివేకానంద విద్యా గ్రామీణ అభివృద్ధి సంస్థ, సమరసత సేవా ఫౌండేషన్ సంయుక్తంగా భట్టిప్రోలు, ఐలవరం గ్రామాలలో నిర్వహించిన వేడుకలలో భాగంగా తొలుత గ్రామ పురవీధులలో వివేకనందుడు, భరతమాత నినాదాలతో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం స్థానిక వేణుగోపాలస్వామి దేవస్థానంలో నిర్వహించిన సభలో పలువురు మాట్లాడుతూ, వివేకానందుడి సూక్తులను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని పాటించాలని సూచించారు. యువత వివేకానందుడి బాటలో పయనిస్తూ హిందూ ధర్మం, భారతదేశాభివృద్ధికి పాటు పడాలని కోరారు. ఈ సందర్భంగా 2025 వివేకానంద పురస్కారం ఉత్తమ ఉపాధ్యాయుడు, సంగీత విద్వాంసుడు, ఆధ్యాత్మిక వేత్త అయిన మరదాప కోటేశ్వరరావుకు అందజేసి శాలువాలు, పూల మాలలతో సత్కరించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు జంజనం హేమశంకరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి జంజనం జ్యోతిలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు మురుగుడు శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బండారు శ్రీనివాసరావు, జిల్లా పరియోజన ప్రముఖ్ పడమట వెంకటేశ్వరరావు, జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ, వామనపల్లి కోటేశ్వరరావు, వేల్పూరి శ్రీనివాస్, దీపాల శివప్రసాద్, మాచర్ల తులసిరంగరావు, మున్నం చిన్నసుబ్బారెడ్డి, వీరస్వామిరెడ్డి, ధర్మ ప్రచారక్ చింతల మురళీకృష్ణ పాల్గొన్నారు.



మరదాపకు వివేకానంద పురస్కారం అందజేస్తున్న సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు

14న ముగ్గుల పోటీలు

రేపల్లె రూరల్: సంక్రాంతిని పురస్కరించుకుని పట్టణంలోని 7వ వార్డు అగ్రహారం బజారులో ఈ నెల 14వ తేదీ మంగళవారం మధ్యాహ్నం పట్టణ ఆదర్శ వేదిక ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పట్టణ ఆదర్శ వేదిక కన్వీనర్ యడ్లపల్లి కిషోర్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలకు ముగ్గుల పోటీలు, చిన్నారులు, మహిళలకు ఆటల పోటీలు నిర్వహించబడునన్నారు. విజేతలకు బహుమతులు అందజేయబడునని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 93471 59811నంబరును సంప్రదించాలని కోరారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



నిజాంపట్నం: మండలంలోని పుల్లమెరక గ్రామంలో అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయి నిరాశ్రయుడైన పులివర్తి భాస్కరరావుకు గ్రామస్తులు ఆదివారం చేయూతనిచ్చారు. బాధితుడు భాస్కరరావుకు గ్రామస్తులు రూ.25 వేలు నగదును సహాయంగా అందించారు. బాధితుని కుటుంబానికి గ్రామస్తులంతా అండగా ఉంటామని హామీనిచ్చారు. కార్యక్రమంలో దాతలు గురివిందపల్లి రామారావు, బేతపూడి రామారావు, కొక్కిలిగడ్డ ప్రభాకర్, రమేస్, సృజన్‌రావు తదితరలు పాల్గొన్నారు.

మదర్సాకు ఇన్వర్టర్ అందజేత



నగరం: మండలంలోని సజ్జవారిపాలెంలో అనాథ ముస్లిం చిన్నారులకు నిర్వహిస్తున్న మదర్సాకు వైఎస్సార్‌సీపీ బాపట్ల జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షురాలు నసిరున్నీసా ఆదివారం చేయూతనిచ్చారు. రాత్రి సమయంలో చిన్నారులు చదువుకుంటున్నప్పుడు ఆకస్మికంగా విద్యుత్ కోతలు ఏర్పడటంతో అసౌకర్యానికి గురవుతున్నారని తెలుసుకున్న ఆమె మదర్సా నిర్వాహకులకు ఇన్వర్టర్‌ను అందజేశారు. మదర్సా నిర్వహణకు భవిష్యత్‌లో అండగా ఉంటానని హామీనిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు అతిక్ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల ఉచ్చులో పడవద్దు

మంగళగిరి (తాడేపల్లిరూరల్): యువత మాదక ద్రవ్యాల ఉచ్చులో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని బీసీ సంక్షేమ, స్వర్ణకార సంఘాల జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్ అన్నారు. గుంటూరు డీఎస్‌ఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, డీఎస్‌ఆర్ డీ ఎడిక్షన్ అండ్ కౌన్సెలింగ్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళగిరి పట్టణ పరిధిలోని టిడ్కో గృహాల వద్ద ఆదివారం యువతకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహేష్ మాట్లాడుతూ చెడు స్నేహాల వల్ల లేదా పరిస్థితుల ప్రభావంతో తాత్కాలిక ఆనందం కోసం మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే అనేక రుగ్మతల బారిన పడతారని అన్నారు. మాదక ద్రవ్యాలు సేవించడం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. ముగ్గుల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గిరిజ, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు సుష్మ, బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షులు నరసింహారావు,, విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ అధ్యక్షురాలు కాగితాల స్వాతి, స్థానికులు రాజ్యలక్ష్మి, సుబ్బారావు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న పారేపల్లి మహేష్

తూతూ మంత్రంగా కోడి పందేల బరుల తొలగింపు



వేమూరు: సంక్రాంతి సంబరాలకు కోడి పందేల బరులకు ప్రభుత్వం అనుమతి లేకపోవడంతో పోలీసులు తూతూ మంత్రంగా శిబిరాలు తొలగించడం జరిగింది. నియోజకవర్గంలోని వేమూరు మండలం జంపని గ్రామంలో షుగర్ ఫ్యాక్టరీ పంట పొలాల్లో సంక్రాంతి సంబరాలకు కోడి పందేలు శిబిరం ఏర్పాటు చేశారు. కొల్లూరు మండలంలోని క్రాప, అనంతరం వద్ద బరులు ఏర్పాటు చేశారు. భట్టిప్రోలు మండలంలోని పల్లికోన గ్రామంలో ఏర్పాటు చేశారు. చుండూరు మండలంలో కేస్‌పల్లి వద్ద బరి ఏర్పాటు చేశారు. కోడి పందేల బరులకు ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. అందువల్ల బరులు తొలగించాలని ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. దీంతో పోలీసులు ఆదివారం బరులు తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు. శిబిరాల వద్ద ఏర్పాటు చేసిన టెంట్‌లు తొలగించడం జరిగింది. పోలీసులు వెళ్లిన వెంటనే కోడి పందేల నిర్వాహకులు తొలగించిన టెంట్‌లు తిరిగి ఏర్పాటు చేసుకున్నారు.